సాక్షి
రంగారెడ్డి
బుధవారం । 27 । డిసెంబర్ । 2023



కబ్జాకోరుల 'గుడి'పురాణీ!

అదో విలువైన ప్రభుత్వ స్థలం. కబ్జాదారుల కన్ను పడింది. ఆ భూమి ప్రస్తుత మార్కెట్ విలువ సుమారు రూ.30 కోట్లు. 8లో▸



'ఫార్మాసిటీ'పై విచారణ


పట్టా భూముల రికార్డులను ధరణిలో రైతుల పేర్లపై మార్చేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు. 8లో▸



పెరిగిన చలి..

ఐదు రోజులుగా ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోతున్నాయి. ఉదయం 10 గంటల వరకు మంచు తెరలు వీడటం లేదు. 8లో▸

మళ్లీ మైనింగ్ కలవరం



యాచారం-మొండిగౌరెల్లి గ్రామాల మధ్యన స్టోన్ క్రషర్లు ఏర్పాటు చేయదల్చిన గుట్ట

- ఇప్పటికే గ్రామాల్లో స్టోన్ క్రషర్లు, క్వారీల ఏర్పాటును అడ్డుకున్న గ్రామస్తులు
- మరోసారి వ్యాపారుల ప్రయత్నాలు
- అనుమతులు ఇవ్వాలని పైరవీలు
- స్థానిక ప్రజాప్రతినిధులకు గాలం
- మచ్చిక చేసుకునేందుకు ఆఫర్లు
- రానిచ్చేది లేదంటున్న స్థానికులు

యాచారం: స్టోన్ క్రషర్లు, క్వారీల ఏర్పాటుపై మైనింగ్ మాఫియా ఆశలు వదులు కోవడం లేదు. గ్రామాల్లోని ప్రజాప్రతినిధులను మచ్చిక చేసుకోవడం కోసం చిన్న అవకాశం దొరికినా రూ.లక్షలు కుమ్మరిస్తున్నాయి. బీఆర్‌ఎస్ ప్రభుత్వం పోయి, తాజాగా కాంగ్రెస్ సర్కార్ రావడంతో మైనింగ్ వ్యాపారులు యాచారం మండలంలోని పలు గ్రామాల్లో స్టోన్ క్రషర్లు, క్వారీల ఏర్పాటుకు మళ్లీ పావులు కదుపుతున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం యాచారం రెవెన్యూ పరిధిలోని 105, 121, 126, 132, 146, 200 సర్వేనంబర్లలోని దాదాపు 250 ఎకరాలకుపైగా ప్రభుత్వ భూముల్లోని గుట్టల్లో స్టోన్ క్రషర్లు, క్వారీల ఏర్పాటుకు మైనింగ్ జోన్‌గా గుర్తించింది. పలు కంపెనీలు స్టోన్ క్రషర్లు, క్వారీల ఏర్పాటుకు 40కిపైగా అర్జీలు పెట్టుకున్నాయి. స్థానికంగా వ్యతిరేకత రావడంతో పంచాయతీలో ఎన్‌ఓసీ ఇవ్వలేదు. అర్జీలు పెట్టుకున్న వ్యాపారులకు స్థలాల ఎంపిక కోసం అధికారులు ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టగా తీవ్ర వ్యతిరేకత వచ్చింది. దీంతో ఉన్నతాధికారులు సైతం వెనక్కి తగ్గి స్థలాలు అప్పగించలేం అంటూ వ్యాపారులకు తెగేసి చెప్పారు.

అనుమతిచ్చేది లేదని చెప్పినా..

ఆశలు వదులుకోని మైనింగ్ మాఫియా స్థానికంగా వ్యతిరేకత లేకుండా ప్రయత్నాలను ముమ్మరం చేస్తూనే ఉంది. కొద్ది నెలల క్రితం యాచారం రెవెన్యూ పరిధి యాచారం-మొండిగౌరెల్లి గ్రామాల మధ్యన ఓ వ్యాపారి స్టోన్ క్రషర్, క్వారీ పెట్టడానికి అర్జీ పెట్టుకుంటే అధికారులు నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణ సభను స్థానికులు అడ్డుకుని, కుర్చీలను పగులగొట్టి, టెంట్లను కూల్చేయడం తెలిసిందే. అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని పలు గ్రామాల్లో ఇప్పటికే 600 ఎకరాలకు పైగా భూముల్లో స్టోన్ క్రషర్లు, క్వారీలు నిర్మించిన దృష్ట్యా అప్పటి ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి సైతం యాచారం, మంచాల, ఇబ్రహీంపట్నం మండలాల్లో కొత్తగా స్టోన్‌క్రషర్లు, క్వారీలకు అనుమతిచ్చేది లేదని స్పష్టం చేశారు. తాజాగా కొత్త ప్రభుత్వం రావడంతో మైనింగ్ వ్యాపారులు సీఎం పేషీ నుంచి వచ్చామని, స్టోన్‌క్రషర్లు, క్వారీలకు అనుమతులు ఇవ్వాలని మళ్లీ పైరవీలు ప్రారంభించారు.

తాజాగా మొండిగౌరెల్లి గ్రామంలో..

మొండిగౌరెల్లి 19 సర్వే నంబర్‌లోని 14 ఎకరాల్లో ఓ వ్యాపారి ఒకరిద్దరి నేతలను మచ్చిక చేసుకుని స్టోన్ క్రషర్, క్వారీ ఏర్పాటుకు మూడేళ్లుగా విశ్వ ప్రయత్నం చేస్తున్నాడు. ఇక్కడ అత్యధికంగా రైతులు వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ప్రతి రైతు తమకున్న ఎకరా, అర ఎకరా వ్యవసాయ పొలంలో పుదీనా, కొత్తిమీర, ఇతర ఆకుకూరలు సాగు చేస్తూ నిత్యం మాదన్నపేట, సరూర్‌నగర్ మార్కెట్లోకి తీసుకెళ్లి విక్రయాలు సాగిస్తుంటారు. గతంలో యాచారం-మొండిగౌరెల్లి గ్రామాల మధ్యన ఉన్న స్టోన్ క్రషర్‌తో వచ్చే దుమ్ము, ధూళితో పంటలకు తీవ్ర నష్టం జరగడం.. బోరుబావులు పూడుకుపోవడం.. బ్లాస్టింగ్ శబ్దాలకు గ్రామంలోని ఇళ్లకు పగుళ్లు ఏర్పడి తీవ్ర నష్టం జరిగింది. వ్యాపారి స్టోన్ క్రషర్, క్వారీ పెట్టుకోకుండా అడ్డుకున్న ఏడుగురు రైతులపై కేసులు నమోదు చేయించారు. కేసుల పాలైన రైతులు కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు. గతానుభవాల దృష్ట్యా సర్వే నంబర్ 19లో నిర్మించే స్టోన్ క్రషర్, క్వారీని ఏర్పాటు చేయనీయకుండా పట్టుదలతో ఉన్నారు.

భారీ ఆఫర్లతో మచ్చిక!

తాజాగా మైనింగ్ వ్యాపారులు ఆయా గ్రామాల్లోని ప్రజాప్రతినిధులను మచ్చిక చేసుకుని ఎన్‌ఓసీలు తెచ్చుకునేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టారు. ఇందుకోసం భారీ ఆఫర్లు ప్రకటిస్తున్నట్టు సమాచారం. గ్రామాల్లో కొంతమంది మధ్యవర్తులను గుప్పిట్లో పెట్టు కుని స్టోన్ క్రషర్లు, క్వారీలను వ్యతిరేకిస్తున్న రైతులపైకి ఉసిగొల్పుతున్నట్టు తెలుస్తోంది. మరోవైపు కొద్ది నెలల్లో తమ పదవీ కాలం పూర్తవుతున్న దృష్ట్యా కొంతమంది ప్రజాప్రతినిధులు తమ జేబులు నిండితే చాలు అన్నట్లు వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

జీవనోపాధి కోల్పోతాం



మైనింగ్ జోన్ వస్తే జీవనోపాధి కోల్పోతాం. గ్రామంలో వందలాది మంది రైతులు పుదీనా తదితర ఆకు కూరలు సాగు చేసుకుని జీవనోపాధి పొందుతున్నాం. స్టోన్ క్రషర్లు, క్వారీలు ఏర్పాటు చేస్తే దుమ్ము, ధూళితో సాగు చేసిన పంటలు పాడై తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుంది.

– సందీప్‌రెడ్డి, రైతు, మొండిగౌరెల్లి

కేసులకు జంకేది లేదు



గ్రామంలో నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేస్తున్న ఓ స్టోన్ క్రషర్, క్వారీ పనులను అడ్డుకున్నందుకు ఏడుగురు రైతులపై వ్యాపారులు కేసులు పెట్టారు. మేము కూడా హైకోర్టును ఆశ్రయించాం. కేసులు పెట్టినా, జైళ్లకు పంపినా స్టోన్ క్రషర్లు, క్వారీలను రానిచ్చేది లేదు.

–రవీందర్, బీజేపీ మండల అధ్యక్షుడు

మైనింగ్ జోన్ రానివ్వం



రైతుల సంక్షేమమే ముఖ్యం. యాచారం మండలంలో మైనింగ్ జోన్‌ను రానిచ్చేది లేదు. మొండిగౌరెల్లిలో స్టోన్ క్రషర్, క్వారీల ఏర్పాటుపై ఆ గ్రామ రైతులు ఫిర్యాదు చేశారు. త్వరలో మైనింగ్ శాఖ అధికారులతో సమావేశమై ఈ విషయమై చర్చిస్తాం.

– మల్‌రెడ్డి రంగారెడ్డి, ఎమ్మెల్యే, ఇబ్రహీంపట్నం



అధికారులకు సూచనలు చేస్తున్న అడిషనల్ కలెక్టర్ భూపాల్‌రెడ్డి

ప్రజాపాలన పకడ్బందీగా ఉండాలి

- అడిషనల్ కలెక్టర్ భూపాల్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: నిరుపేదల ఆర్థిక ప్రగతి కోసం ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని అడిషనల్ కలెక్టర్ భూపాల్‌రెడ్డి అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో మంగళవారం నియోజకవర్గ స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రజా పాలన కార్యక్రమం కోసం ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. మహాలక్ష్మి, రైతుభరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇ ల్లు, చేయూత పథకాలకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రతి కుటుంబానికి ఒకరు మాత్రమే అర్హులన్నారు. రోజుకు రెండు పంచాయతీల్లో సమావేశాలు ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు. దరఖాస్తులు ప్రభుత్వమే ఉచితంగా అందజేస్తుందని తెలిపారు. తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఎంఈఓలు, డిప్యూటీ తహసీల్దార్లు టీములుగా ఏర్పాటు చేసుకొని కుటుంబాల వారీగా కౌంటర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 వరకు సమావేశాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. కింది స్థాయి ఉద్యోగి నుంచి పై స్థాయి అధికారుల వరకు అందరూ సమష్టిగా పని చేయాలన్నారు. మున్సిపల్ వార్డుల్లో విస్తృత ప్రచారం చేయాలన్నారు. దరఖాస్తుల స్వీకరణ, భద్రపర్చడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని హెచ్చరించారు. అవసరమైతే పోలీసుల సహకారం తీసుకోవాలన్నారు. అధికారులు సమన్వయంతో పని చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ సంగీత, ఆర్డీఓలు సూరజ్‌కుమార్, మల్లయ్య, శ్రీనివాస్, సాయిరాం, అనంతరెడ్డి, జెడ్పీ సీఈఓ దిలీప్‌కుమార్, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి రాజేశ్వర్‌రెడ్డి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి ప్రభాకర్, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి రామారావు, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, సీపీఓ సౌమ్య, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, కమిషనర్లు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

కందుకూరు: ప్రజా పాలన కార్యక్రమాన్ని విజయవంతం చేసేలా అధికారులు, సిబ్బంది పని చేయాలని జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ రాజేశ్వర్‌రెడ్డి సూచించారు. మండల పరిషత్ సమావేశపుహాల్‌లో మంగళవారం కందుకూరు, మహేశ్వరం మండలాలకు చెందిన అధికారులు, పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంచాయతీ స్థాయిలో పంచాయతీ కార్యదర్శి నోడల్ అధికారిగా వ్యవహరించి ఐదు గ్యారంటీలకు సంబంధించిన దరఖాస్తులను సేకరిస్తారన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించకుండా దరఖాస్తులు స్వీకరించాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీఓ సూరజ్‌కుమార్, ఎంపీడీఓలు ఎస్.వెంకట్రాములు, నర్సింహులు, తహసీల్దార్ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

అద్దె బస్సులపై ప్రీ బిడ్ సమావేశం రేపు

సాక్షి, సిటీబ్యూరో: ఆర్టీసీ గ్రేటర్ హైదరాబాద్‌జోన్‌లో 340 అద్దె బస్సుల కోసం ఈ నెల 28న ప్రీబిడ్ సమావేశం నిర్వహించనున్నట్లు ఆర్టీసీ ఈడీ వెంకటేశ్వర్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం11 గంటలకు జూబ్లీ బస్‌స్టేషన్‌లోని రెండో అంతస్తులో ఉన్న ఈడీ కార్యాలయంలో సమావేశం జరగనుంది. ప్రైవేట్ సంస్థలు, వ్యాపారుల నుంచి ఆర్టీసీ సికింద్రాబాద్ రీజియన్‌కు 178, హైదరాబాద్ రీజియన్‌కు 162 బస్సుల చొప్పున అద్దె ప్రాతిపదికన తీసుకొనేందుకు ఆర్టీసీ నోటిఫికేషన్ వెలువరించిన సంగతి తెలిసిందే. జనవరి 3వ తేదీ వరకు వ్యాపారులు నగరంలోని వివిధ మార్గాల వారీగా తమ టెండర్‌లను దాఖలు చేయొచ్చు. ఈ క్రమంలోనే బిడ్డింగ్ నిబంధనలు, ఇతర అంశాలపై ఆసక్తిగల వ్యాపారులు, సంస్థల సందేహాలను నివృత్తి చేసేందుకు ప్రీబిడ్ సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఈడీ పేర్కొన్నారు.

న్యూస్‌రీల్

బాలికల క్రికెట్ టోర్నీ విజేత రంగారెడ్డి



విజేతగా నిలిచిన రంగారెడ్డి జట్టు

అశ్వాపురం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురంలోని గౌతమీనగర్ కాలనీ హోమిబాబా క్రీడామైదానంలో జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నాలుగు రోజులుగా జరుగుతున్న రాష్ట్రస్థాయి పాఠశాలల అండర్–17 బాలికల క్రికెట్ పోటీలు మంగళవారం ముగిసాయి. టోర్నీ విజేతగా రంగారెడ్డి జట్టు నిలవగా రన్నరప్‌గా మహబూబ్‌నగర్, మూడో స్థానంలో ఖమ్మం జట్టు నిలిచాయి. మంగళవారం జరిగిన మొదటి సెమీస్‌లో రంగారెడ్డి, నిజామాబాద్ జట్లు తలపడగా రంగారెడ్డి జట్టు గెలిచి ఫైనల్స్ చేరింది. రెండో సెమీస్ ఆతిథ్య ఖమ్మం, మహబూబ్‌నగర్ జట్ల మధ్య జరగగా మహబూబ్‌నగర్ జట్టు గెలుపొంది ఫైనల్స్‌లోకి ప్రవేశించింది. ఫైనల్స్‌లో రంగారెడ్డి – మహబూబ్‌నగర్ జట్లు తలపడగా టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న రంగారెడ్డి జట్టు 12 ఓవర్లలో మూడు వికెట్లు కోల్పోయి 109 పరుగుల భారీ స్కోర్ చేసింది. బ్యాటింగ్‌కు దిగిన మహబూబ్‌నగర్ జట్టు 49 పరుగులకే ఆలౌట్ కావడంతో రంగారెడ్డి జట్టు విజేతగా నిలిచింది. మూడో స్థానం కోసం జరిగిన మ్యాచ్‌లో ఖమ్మం – నిజామాబాద్ జట్లు తలపడగా ఖమ్మం జట్టు విజయం సాధించింది. అనంతరం విజేత, రన్నరప్ జట్లకు అతిథులు బహుమతులు అందజేశారు.

శ్రీరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠకు ఆహ్వానం



బ్రహ్మశ్రీ గురూజీ అనిల్‌కుమార్‌జోషి

కందుకూరు: అయోధ్య రామాలయంలో వచ్చే నెల 22న జరగనున్న శ్రీరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమానికి ప్రత్యేక ఆహ్వానితుడిగా కందుకూరు మండలం పులిమామిడి పరిధిలోని శ్రీనిఖిల్ చేతనా కేంద్రం నిర్వాహకుడు బ్రహ్మశ్రీ గురూజీ అనిల్‌కుమార్‌జోషికి ఆహ్వానం అందింది. ఈ మేరకు శ్రీరామ జన్మభూమి తీర్థ్ క్షేత్ర సెక్రటరీ జనరల్ చంపత్‌రాయ్ ఆయనకు ఆహ్వానం పంపారు. భవ్య రామమందిరం నిర్మిస్తున్న స్థలంలో 2018 నవంబర్‌లో గురూజీ అనిల్‌కుమార్‌జోషి ఆధ్వర్యంలో తీర్థ్ క్షేత్ర నిర్వాహకులు ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. 2019 నవంబర్ 9న సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు అనంతరం చేపట్టిన రామాలయ నిర్మాణంతో పాటు పలు అంశాలపై ఆయన సలహాలు, సూచనలను నిర్వాహకులు పాటిస్తూ వస్తున్నారు.

ఏళ్ల పోరాటం నెరవేరబోతోంది

చిలుకూరు బాలాజీ దేవాలయం అర్చకుడు రంగరాజన్



మాట్లాడుతున్న అర్చకుడు రంగరాజన్

మొయినాబాద్: అయోధ్యలో రామ మందిర నిర్మాణంకోసం ఏళ్లుగా చేసిన పోరాటం జనవరి 22న నెరవేరనుందని చిలుకూరు బాలాజీ దేవాలయం అర్చకుడు రంగరాజన్ అన్నారు. అయోధ్యలో రామమందిరం ప్రాణ ప్రతిష్ఠను పురస్కరించుకుని అక్కడి నుంచి వచ్చిన రాముని అక్షింతలను మండల పరిధిలోని చిలుకూరు బాలాజీ దేవాలయ వద్ద మంగళవారం వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రామమందిరం ప్రాణప్రతిష్ఠ దేశ ప్రజలందరికీ పండుగ రోజన్నారు. జనవరి 22న అంతా పండుగ చేసుకోవాలన్నారు. ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని ప్రజలంతా వీక్షించే ఏర్పాట్లు చేయాలన్నారు. దేశంలోని ప్రతి ఇంటికీ రాముని అక్షింతలు వెళ్లాలని.. వాటికి పూజలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో మహారాష్ట్ర మాజీ మంత్రి సంజయ్ సావర్కర్, అనంతగిరి జిల్లా విశ్వ హిందూ పరిషత్ కార్యదర్శి శ్రీలతరెడ్డి, హిందూ సంఘాల నేతలు అంజన్‌కుమార్‌గౌడ్, దశరథరెడ్డి, గున్నాల గోపాల్‌రెడ్డి, సహదేవ్‌గౌడ్, శ్రీరాములు, శ్రీనివాస్‌రెడ్డి, మహేందర్, వినయ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అమిత్‌షా కార్యక్రమ పనులు పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

కేంద్రంలో తిరిగి బీజేపీదే గెలుపు

- పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు
- కేంద్ర హోంమంత్రి అమిత్‌షా సమావేశ ఏర్పాట్ల పరిశీలన

ఇబ్రహీంపట్నం రూరల్: కేంద్రంలో మరోసారి భారీ మెజార్టీతో నరేంద్రమోదీ సర్కార్ రావడం ఖాయమని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఈ నెల 28న కొంగరకలాన్‌లోని శ్లోకా కన్వెన్షన్ హాల్‌లో జరగనున్న పార్టీ పదాధికారుల సమావేశానికి కేంద్ర హోంమంత్రి అమిత్‌షా రానున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం పార్టీ నాయకులు ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాసం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికల్లో గెలుపు, అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమికి గల కారణాలపై సమీక్ష ఉంటుందని తెలిపారు. డబుల్ ఫిగర్ ఎంపీలు గెలుపొందడమే లక్ష్యంగా సమావేశం ఉంటుందన్నారు. ఇందుకోసం దిశానిర్దేశం చేస్తారని తెలిపారు. కార్యక్రమానికి అమిత్‌షాతో పాటు పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు తరుణ్‌చుగ్, సునీల్ బన్సాల్, అరవింద్ హాజరుకానున్నట్లు చెప్పారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి గంగాపురం కిషన్‌రెడ్డి అధ్యక్షతన సమావేశం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి, వనపర్తి ఇన్‌చార్జి బోసుపల్లి ప్రతాప్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొత్త అశోక్‌గౌడ్, పోరెడ్డి నర్సింహారెడ్డి, నోముల దయానంద్, లచ్చిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు దన్నె భాషయ్య, అసెంబ్లీ కన్వీనర్ యాదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెండు కిలోల ఆల్ఫ్రాజోలం పట్టివేత

- ఎక్సైజ్ కానిస్టేబుల్‌తో పాటు మరొకరి అరెస్ట్

షాద్‌నగర్ రూరల్: అక్రమంగా తరలిస్తున్న రెండు కిలోల ఆల్ఫ్రాజోలంను స్వాధీనం చేసుకున్న పోలీసులు నిందితులను రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటన షాద్‌నగర్ పట్టణంలో మంగళవారం చోటుచేసుకుంది. డీఐ రాంరెడ్డి కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి.. కామారెడ్డిలో ఎక్సైజ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న రమేశ్ రెండు కిలోల ఆల్ఫ్రాజోలంను విక్రయించేందుకు షాద్‌నగర్ వచ్చాడు. షాబాద్‌కు చెందిన నర్సింలు తీసుకునేందుకు రమేశ్‌తో ఒప్పందం చేసుకున్నాడు. ఈ మేరకు నర్సింలు పట్టణంలోని న్యూసిటీ కాలనీకి వచ్చాడు. విశ్వసనీయ సమాచారం మేరకు టీ న్యాబ్ బృందం సభ్యులు దాడులు నిర్వహించారు. రెండు కిలోల ఆల్ఫ్రాజోలంను స్వాధీనం చేసుకుని ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. నిందితులను స్థానిక పోలీసులకు అప్పగించారు. పట్టుబడ్డ ఆల్ఫ్రాజోలం విలువ రూ.20 లక్షల వరకు ఉంటుందని డీఐ రాంరెడ్డి పేర్కొన్నారు. టీ న్యాబ్ పోలీసుల ఫిర్యాదు మేరకు నిందితులపై కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న ఆల్ఫ్రాజోలం

ఫిర్యాదుదారులకు ఫ్రెండ్లీ పోలీసింగ్

- నేరస్తులను వదిలే ప్రసక్తే లేదు
- విధుల్లో నిర్లక్ష్యం సహించం
- రాచకొండ కమిషనర్ సుధీర్‌బాబు

ఇబ్రహీంపట్నం రూరల్: సమస్యలపై పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదు దారులకే ఫ్రెండ్లీ పోలీసింగ్ కాని నేరస్తులకు కాదని రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌ను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. శాంతి భద్రతలను కాపాడటానికి పోలీసులు చాకచక్యంగా పని చేయాలని అన్నారు. సమస్య వచ్చిందంటే వెంటనే స్పందించాలని, 100 నుంచి కాల్ వచ్చిన క్షణాల్లో బాధితుల వద్దకు చేరుకోవాలన్నారు. శాంతి భద్రతలను పరిరక్షించడంలో వీలైనంత వరకు సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించుకోవాలని సూచించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో డీసీపీ చింతమనేని శ్రీనివాస్, ఏసీపీ శ్రీనివాస్‌రావు, ఇన్‌చార్జి సీఐ బఖ్యానాయక్, ఎస్‌ఐలు మారయ్య, మైబెల్లి తదితరులు పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నం ఠాణాలో సిబ్బందితో మాట్లాడుతున్న రాచకొండ సీపీ సుధీర్‌బాబు

ధ్యాన జగత్తు సాకారానికి కృషి చేయాలి

- పిరమిడ్ ట్రస్ట్ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి
- ఆరో రోజుకు చేరిన ధ్యాన మహాయాగం

కడ్తాల్: ధ్యానజగత్తు కల 2030 నాటికి సాకారం అయ్యేందుకు ధ్యానులు ఐకమత్యంతో పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీస్ మూవ్‌మెంట్‌ను ముందుకు తీసుకెళ్లాలని మహేశ్వర మహా పిరమిడ్ ట్రస్ట్ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి పిలుపునిచ్చారు. భవిష్యత్తులో మహేశ్వర మహాపిరమిడ్ షిర్డీ క్షేత్రంలా విరాజిల్లుతుందని ధ్యాన గురువు బ్రహ్మర్షి పత్రీజీ చెప్పేవారని గుర్తు చేశారు. మహేశ్వర పిరమిడ్‌లో జరుగుతున్న పత్రీజీ ధ్యాన మహాయాగాలు మంగళవారానికి ఆరో రోజుకు చేరుకున్నాయి. ప్రాతఃకాల సంగీత ధ్యానంతో పాటు, ప్రత్యేకించి దత్తపౌర్ణమిని పురస్కరించుకుని ఉదయం 5 నుంచి 12 గంటల వరకు వేలాది మంది ధ్యానులతో సామూహిక ధ్యానం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ.. పత్రీజీ ఆశయ సాధనకు, ధ్యాన జగత్తు నిర్మాణానికి ప్రతి పిరమిడ్ మాస్టర్, ధ్యాని కృషి చేయాలని కోరారు. మహేశ్వర మహాపిరమిడ్ కేంద్రానికి మైహోమ్స్ అధినేత జూపల్లి రామేశ్వరరావు రూ. కోటి విరాళం అందించడం శుభపరిణామమని అన్నారు.

ధ్యాన కేంద్రాన్ని తీర్చిదిద్దుతాం..

పత్రీజీ స్వప్నమైన ధ్యానజగత్తు కల సాకారానికి ప్రతి పిరమిడ్ మాస్టర్ కృషి చేయాలని పీఎస్ఎస్ఎం గ్లోబల్ ఫౌండర్ పరిమళపత్రి అన్నారు. ధ్యాన మహాయాగం అద్భుత విజయం సాధించిందని హర్షం వ్యక్తం చేశారు. త్వరలోనే సీఎం, పీఎంలు కూడా మహేశ్వర మహాపిరమిడ్ క్షేత్రానికి వస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. రానున్న ఏడాదిలో ధ్యానులతో మహేశ్వర మహాపిరమిడ్ ధ్యాన కేంద్రం కళకళలాడేలా తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు. అనంతరం పత్రీజీ గురువు సదానందయోగి జీవిత చరిత్రపై పూర్ణిమ, లక్ష్మీనారాయణమ్మ రచించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పీఎంసీ ట్రస్ట్ చైర్మన్ దాట్ల హనుమంతరాజు, మేనేజింగ్ డైరెక్టర్ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.





పుస్తకాలు ఆవిష్కరిస్తున్న పరిమళపత్రి, పరిణీత పత్రి, ట్రస్ట్ సభ్యులు, కళాకారిణుల నృత్య ప్రదర్శన

దర్గాపై బీఆర్‌ఎస్‌ చిన్నచూపు

- ప్రచారానికే పరిమితమైన గత ప్రభుత్వం
- భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలి
- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌


దర్గాలో ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే శంకర్, తదితరులు

కొత్తూరు: జేపీ దర్గా అభివృద్ధిపై వక్ఫ్‌బోర్డు అధికారులు, గత పాలకులు అనుసరించిన తీరు దారుణంగా ఉందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ మండిపడ్డారు. త్వరలో జరగనున్న ఉర్సు ఉత్సవాల సందర్భంగా ఆయన పలువురు నాయకులతో కలిసి మంగళవారం దర్గాను దర్శించుకొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం దర్గా ఆవరణలో పర్యటిస్తూ సమస్యలు తెలుసుకున్నారు. బీఆర్‌ఎస్‌ ప్రభుత్వ హయాంతో దర్గాను అభివృద్ధి చేస్తున్నట్లు ప్రచారం చేసుకున్నారనే తప్పా ఎలాంటి అభివృద్ధి చేయలేదని తప్పుబట్టారు. ప్రణాళిక ప్రకారం పనులు జరగకుండా అధికారులు, పాలకులు కాలయాపన చేశారని ఆరోపించారు. దర్గాకు హుండీ, టెండర్ల రూపంలో వక్ఫ్‌బోర్డుకు కోట్ల రూపాయాల ఆదాయం వస్తున్న అభివృద్ధిపై దృష్టి సారించకపోవడం దారుణమన్నారు. భక్తులకు కనీస సదుపాయాలు కూడా కల్పించలేదని విమర్శించారు.

వెంటనే సౌకర్యాలు కల్పించాలి

త్వరలో జరగనున్న ఉర్సుకు భక్తులు వేల సంఖ్యలో హాజరవుతారని శంకర్‌ తెలిపారు. ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా మొబైల్‌ టాయిలెట్స్, తాగునీటి వసతి, స్నానాల గదులతో పాటు పలు సౌకర్యాలు కల్పించాలని వక్ఫ్‌బోర్డు అధికారులకు సూచించారు. దర్గా సమీపంలోని చెరువులోకి భక్తులు వెళ్లకుండా సూచిక బోర్డులు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ శ్యాంసుందర్‌రెడ్డి, నాయకులు బాబార్‌ఖాన్, ఇబ్రహీం, ఖాజా, రవికుమార్‌ గుప్తా, మసూద్, రవి, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

కబ్జాకోరుల ‘గుడి’పురాణీ!

- ఆలయాల పేరుతో ప్రభుత్వ భూముల ఆక్రమణ
- రెండెకరాల స్థలంలో వెలిసిన గుడులు
- పట్టించుకోని రెవెన్యూ అధికారులు


ప్రభుత్వ భూమిలో నిర్మించిన గుడులు


ప్రభుత్వ భూమిలో బోరు వేస్తున్న కబ్జాదారులు (ఫైల్‌)

సాక్షి, రంగారెడ్డి జిల్లా: అదో అత్యంత విలువైన ప్రభుత్వ స్థలం. ఆ భూమి ప్రస్తుత మార్కెట్‌ విలువ ప్రకారం సుమారు రూ.30 కోట్లు. ఇంకేం .. కబ్జాదారుల కన్ను పడింది. గుడుల పేరుతో యథేచ్ఛగా కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూములను కొల్లగొడుతున్నారు. ఎన్నికల హడావిడిలో అధికారులుండగా భూమిని చదును చేసి గుడులను నిర్మించారు కబ్జాదారులు. అక్రమ నిర్మాణాలను అరికట్టాల్సిన రెవెన్యూ అధికారులు నిమ్మకునీరెత్తినట్లుగా వ్యవహరించడం గమనార్హం. నగర శివారుల్లోని మొయినాబాద్‌ మండలంలో ప్రభుత్వ భూమిని దర్జాగా కబ్జా చేశారు. హైదరాబాద్‌–బీజాపూర్‌ జాతీయ రహదారి పక్కనే కబ్జా పర్వం కొనసాగుతున్నా రెవెన్యూ యంత్రాంగం మాత్రం చూసీచూడనట్లు వ్యవహరించడం విమర్శలకు దారి తీస్తోంది. మొయినాబాద్‌ మండల పరిధిలోని అజీజ్‌నగర్‌ రెవెన్యూలో సర్వే నంబర్‌ 176లో సుమారు 200 ఎకరాలకు పైగా ప్రభుత్వ భూమి ఉంది. 60 ఏళ్ల క్రితం ఈ భూమిని పేదలకు అసైన్డ్‌ చేశారు. అప్పట్లో అసైన్డ్‌ ద్వారా 4 ఎకరాల భూమి పొందిన ఓ రైతు విక్రయించాడు. అసైన్డ్‌ చట్టానికి విరుద్ధంగా భూమిని విక్రయించడంతో ప్రభుత్వం పీఓటీ చట్టం కింద ఆ భూమిని స్వాధీనం చేసుకుంది. తరువాత ఆ భూమిని దిల్‌ సంస్థకు కేటాయించింది. అయితే ఎలాంటి నిర్మాణాలు చేపట్టకపోవడంతో కొంత కాలానికి ప్రభుత్వం తిరిగి స్వాధీనం చేసుకుంది. దీంతో ఆ భూమి ప్రభుత్వ ఆధీనంలోకి వచ్చింది. అయితే ఇటీవల కొందరు వ్యక్తులు ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూమిపై కన్నేశారు. రెండెకరాల భూమిని చదును చేసి కబ్జా చేశారు. అధికారులు అసెంబ్లీ ఎన్నికల పనుల్లో ఉండటంతో కబ్జా చేసిన భూమిలో మూడు గుడులను నిర్మించారు. వాటికి రంగులు వేసి దేవుడి ఫొటోలు, విగ్రహాలు పెట్టారు. భూమిలో అక్కడక్కడ ఉన్న రాళ్లపై సున్నం, జాజు రంగులు వేశారు.

నిద్రావస్థలో రెవెన్యూ యంత్రాంగం

నగరానికి అతి చేరువలో ఉన్న మొయినాబాద్‌ మండలంలో సుమారు రూ.30 కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూమి కబ్జాకు గురైనా రెవెన్యూ యంత్రాంగం నిద్రావస్థలో ఉంది. హైదరాబాద్‌– బీజాపూర్‌ జాతీయ రహదారికి చేరువలో ఉన్న ప్రభుత్వ భూమిని దుండగులు కబ్జా చేసి గుడులు నిర్మించినా అధికారులకు తెలియకపోవడం శోచనీయం. ఎన్నికల ముందే మూడు ప్రధాన పార్టీల అభ్యర్థులు గుడుల నిర్మాణానికి పూజలు చేసినట్లు తెలిసింది. డిప్యూటీ తహసీల్దార్‌ వినోద్‌ను వివరణ కోరగా పరిశీలించి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

8 మంది పేకాట రాయుళ్ల అరెస్టు

శంకర్‌పల్లి: పేకాట శిబిరం దాడి చేసి 8 మందిని పోలీసులు అరెస్ట్‌ చేశారు. ఈ ఘటన శంకర్‌పల్లి పోలీస్‌ స్టేషన్‌ పరిధిలోని మహాలింగపురం గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని మహాలింగపురం గ్రామ శివారుల్లోని వ్యవసాయ క్షేత్రంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అదుకున్న పోలీసులు పేకాట స్థావరంపై దాడి చేసి 8 మంది పేకాటరాయుళ్లను అరెస్ట్‌ చేశారు. నిందితుల నుంచి రూ.75,260 నగదు, 9 సెల్‌ఫోన్‌లు, ఆరు కార్లను సీజ్‌ చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వినాయకరెడ్డి తెలిపారు.

టిప్పర్‌ ఢీకొని యువకుడి మృతి


ఆంజనేయులు (ఫైల్‌)

పహాడీషరీఫ్‌: టిప్పర్‌ ఢీ కొట్టడంతో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన పహాడీ షరీఫ్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్‌ కె.సతీశ్‌ తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్‌ జిల్లా బల్మూర్‌ మండలం కొండనాగుల గ్రామానికి చెందిన ఆంజనేయులు(30) ఎల్‌బీనగర్‌లోని గుంటి జంగయ్య కాలనీలో నివాసముంటున్నాడు. మంగళవారం ఉదయం తన సొంతూరు నుంచి బైక్‌పై హైదరాబాద్‌ బయలుదేరాడు. ఉదయం 8.30 గంటల సమయంలో తుక్కుగూడలోని ఇమాంగూడ వద్ద వెనుక నుంచి టిప్పర్‌ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ ఆంజనేయులు అక్కడికక్కడే మృతి చెందాడు. బాధితులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

డ్రగ్స్‌ రహిత రాష్ట్రమే లక్ష్యం


సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న సీపీ సుధీర్‌బాబు

- మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి
- రాచకొండ సీపీ సుధీర్‌బాబు
- మంచాలలో సీసీ కెమెరాల ఏర్పాటు

మంచాల: మాదక ద్రవ్యాల నుంచి యువతను విముక్తి చేసి డ్రగ్స్‌ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని రాచకొండ సీపీ సుధీర్‌బాబు ప్రకటించారు. మంగళవారం మంచాల పోలీస్‌స్టేషన్‌లో నూతనంగా ఏర్పాటు చూసిన సీసీ కెమెరాల అనుసంధాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ మాదకద్రవ్యాలు యువత జీవితాలను చిత్తు చేస్తున్నాయని, ఈ జాడ్యం పాఠశాలలు, స్కూళ్లకు పాకడం ఆందోళన కలిగిస్తోందన్నారు. చాపకింద నీరులా విస్తరిస్తున్న డ్రగ్స్‌ మాఫియాపై ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. డ్రగ్స్‌ సరఫరా చేసినా.. తీసుకున్న కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సీసీ కెమెరాల పాత్ర కీలకం

ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానమన్నారు. దోషులను గుర్తించడంతో పాటు వారికి శిక్షపడడంలో సీసీ కెమెరాల పాత్ర కీలకమన్నారు. మంచాల మండలంలో 15 గ్రామాల్లో 136 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామని తెలిపారు. గ్రామాల్లో మౌలిక వసతులతో పాటు రక్షణ కూడా చాలా అవసరమని పేర్కొన్నారు. ప్రజలు కూడా పోలీసులకు శాంతిభద్రతల విషయంలో పూర్తి సహకారం అందించాలని కోరారు. రోడ్డు ప్రమాదాల్లో చాలా మంది ప్రాణాలను కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రమాద స్థలాలను గుర్తించి హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేసి.. నివారణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సైబర్‌ నేరాలపై ప్రజలు, యువత, విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీసీపీ శ్రీనివాస్, ఏసీపీ శ్రీనివాస్, మంచాల సీఐ కాశీవిశ్వనాథ్, వివిధ గ్రామాలకు చెందిన ప్రజా ప్రతినిధులు, ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని ఎస్‌ఐలు, పోలీస్‌ సిబ్బంది పాల్గొన్నారు.

‘ఫార్మాసిటీ’ అక్రమాలపై విచారణ జరిపిస్తా

ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి


రైతులతో మాట్లాడుతున్న మల్‌రెడ్డి రంగారెడ్డి

యాచారం: కేసీఆర్‌ సర్కార్‌ రైతుల అంగీకారం లేకుండానే టీఎస్‌ఐఐసీ పేరుపై నమోదు చేసిన పట్టా భూముల రికార్డులను ధరణి పోర్టల్‌లో రైతుల పేర్లపై మార్చే విధంగా కృషి చేస్తానని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు. తొర్రూర్‌ క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఫార్మాసిటీ గ్రామాలైన తాడిపర్తి, నానక్‌నగర్, కుర్మిద్ద, తాడిపర్తి గ్రామాల రైతులు ఎమ్మెల్యేను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్‌ పార్టీ మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా ఫార్మాసిటీని రద్దు చేసి హామీని నిలబెట్టుకున్నట్లు తెలిపారు. అదేవిధంగా హోల్డ్‌లో పెట్టిన రైతుల పట్టా భూముల రికార్డులను టీఎస్‌ఐఐసీ పేరు నుంచి తొలగించి రైతుల పేర్లపై మారుస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటి నుంచి రైతులకు రైతుబంధు, బ్యాంకు రుణాలు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. త్వరలో జిల్లా కలెక్టర్‌తో సమావేశమై.. రైతుల సమస్యలు పరిష్కరిస్తానని భరోసా ఇచ్చారు. ఫార్మాసిటీ భూసేకరణ పేరుతో రూ. కోట్లాది నిధులు స్వాహా చేశారని, వెంటనే విచారణ జరిపి అప్పటి అధికారులు, బీఆర్‌ఎస్‌ నేతలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో కుర్మిద్ద, తాడిపర్తి గ్రామాల సర్పంచ్‌లు రాజశేఖర్‌రెడ్డి, రమేశ్, నానక్‌నగర్‌ మాజీ సర్పంచ్‌ ముత్యాల వెంకట్‌రెడ్డి, ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట సమితి కన్వీనర్‌ శ్రీకాంత్‌ నాయక్, రైతులు మహిపాల్‌రెడ్డి, దార సత్యం, గణేశ్, మల్లేశ్‌యాదవ్‌ పాల్గొన్నారు.

శుభకార్యానికి వెళ్లి వస్తూ మృత్యుఒడికి..

యాచారం: శుభకార్యానికి వెళ్లి తిరిగి వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధి మొండిగౌరెల్లి గ్రామానికి చెందిన కట్టెల యాదయ్య కుమారులైన నాని (18) సన్నీలు, వీరి స్నేహితుడు చేదురుబావి మనోహర్‌ సోమవారం రాత్రి యాచారం మండల కేంద్రంలో జరిగిన బంధువుల శుభకార్యానికి వెళ్లారు. అనంతరం తిరిగి వస్తుండగా.. యాచారం నుంచి మాల్‌ వైపు వేగంగా వెళ్తున్న కారు, వారి బైక్‌ను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో నాని అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన సన్నీ, మనోహర్‌ను స్థానికులు ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్‌ను యాచారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సైదయ్య తెలిపారు. ప్రమాదంలో ఒక కొడుకు మృతి చెందగా, మరో కొడుకు తీవ్ర గాయాలపాలై ఆస్పత్రిలో ఉండడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

పెరిగిన చలి.. పట్టపగలే చీకటి

- గజగజ వణుకున్న ప్రజలు
- జిల్లాలో పడిపోయిన ఉష్ణోగ్రతలు


లైట్ల వెలుతురుతో వెళ్తున్న వాహనాలు

షాబాద్‌: జిల్లాలో ఐదు రోజులుగా ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోతున్నాయి. మంగళవారం షాబాద్‌ మండల తాళ్లపల్లి గ్రామంలో 9 డిగ్రీలకు పడిపోవడంతో ఉదయం 10 గంటల వరకు మంచు తెరలు వీడటం లేదు. పొగమంచు కప్పేస్తుండటంతో రహదారులు స్పష్టంగా కనిపించడం లేదు. ఫలితంగా వాహనదారులు లైట్లు వేసుకుని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. చల్లని గాలులతో చలి తీవ్రత పెరుగుతోంది. ఒక్కసారిగా మారిన వాతావరణంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఈ నెల 25న మండలంలో అతి తక్కువగా 16.5 డిగ్రీల సెల్సియస్‌ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. పగటి ఉష్ణోగ్రతలు అధికంగానే ఉంటున్నా, సాయంత్రం చలి తీవ్రత పెరుగుతోంది.

పొంచి ఉన్న వ్యాధులు

చలి తీవ్రతకు శరీరంలోని రక్తనాళాలు ముడుచుకుపోతాయి. దీంతో రక్తప్రసరణ సాఫీగా సాగదు. ఇది గుండె, మెదడుపై ప్రభావం చూపి ఆయాసం, గుండె నొప్పి, బ్రెయిన్‌ స్ట్రోక్, ఫిట్స్‌తో ఆకస్మికంగా కుప్పకూలే ప్రమాదం ఉంది. అధిక చలి వల్ల ఆస్తమ, శ్వాసకోశ వ్యాధులు రావడానికి అవకాశం ఉంటుంది.

తగిన జాగ్రత్తలు పాటించాలి...



జలుబు, ఆయాసంతో కూడిన శ్వాసకోశ, చర్మ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న వారు జనరల్‌ ఆస్పత్రికి అధికంగా వస్తున్నారు. వెచ్చటి దుస్తులు ధరించాలి. బయటకు వెళ్లినప్పుడు మాస్క్‌ తప్పనిసరిగా పెట్టుకోవాలి. వేడి ఆహారం మాత్రమే తీసుకోవాలి. దానిమ్మ, రేగి, కివి పండ్లు తినాలి. చలిలో బయటకు వెళ్తే దీర్ఘకాలిక వ్యాధులు, మధుమేహం ఇతర సమస్యలు ఉన్నవారి నరాలు దెబ్బతింటాయి. వారికి గుండె నొప్పి వచ్చినా నొప్పి తెలియదు.

–దామోదర్, జిల్లా ఉప వైద్యాధికారి

బ్రహ్మ కమలం పుష్ప వికాసం


బ్రహ్మకమలంతో పూజలు చేస్తున్నప్రదీప్‌కుమార్‌

షాద్‌నగర్‌ రూరల్‌: పుష్పాలలో చాలా అరుదైనది బ్రహ్మ కమలం. శీతల ప్రాంతాల్లో కనిపించే బ్రహ్మ కమలం షాద్‌నగర్‌లో వికసించింది. పట్టణంలోని భగీరథ కాలనీకి చెందిన నటరాజ కళానిలయం వ్యవస్థాపకుడు మానపాటి ప్రదీప్‌కుమార్‌ ఇంట్లో సోమవారం రాత్రి బ్రహ్మకమలాలు విరబూశాయి. ప్రదీప్‌కుమార్‌ కుటుంబ సభ్యులు కిషన్‌నగర్‌ సమీపంలోని కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మకమలం పుష్పాలతో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పరమశివుడిని బ్రహ్మకమలం పుష్పాలతో పూజిస్తే కోరిన కోర్కెలు తీరుతాయని భక్తుల నమ్మకం. అరుదుగా వికసించే ఈ పుష్పాలను చూసేందుకు కాలనీ వాసులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

బైక్‌ అదుపుతప్పి వ్యక్తి మృతి


సుబ్బారావు (ఫైల్‌)

కేశంపేట: బుల్లెట్‌ బండి అదుపుతప్పడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండల కేంద్రంలో మంగళవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌ రాష్ట్రంలోని అంబేడ్కర్‌ కోనసీమ జిల్లా రావులపాలెంకు చెందిన గొట్టిముక్కల సుబ్బారావు (58) మండల పరిధిలోని చౌలపల్లి గ్రామంలో వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నాడు. మంగళవారం కొండారెడ్డిపల్లిలోని బంధువుల ఇంటికి బుల్లెట్‌పై వెళ్తూ అదుపు తప్పి కేశంపేట గ్రామ శివారులో మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు కుమారులున్నారు. మృతుడి కుమారుడు సునీల్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ నర్సింలు తెలిపారు.

వాట్సాప్‌లో రివాల్వర్‌ ఫొటో పంపి..

రాజేంద్రనగర్‌: ‘నిన్ను చంపేందుకు సుపారీ తీసుకున్నా...నిన్ను వదలాలంటే రూ. కోటి బిట్‌ కాయిన్‌కు ట్రాన్స్‌ఫర్‌ చెయ్యి లేని పక్షంలో 27 లోగా నిన్ను చంపుతా’ అంటూ గుర్తు తెలియని వ్యక్తి ప్రముఖ రియల్టర్‌కు తరచూ వాట్సాప్‌ కాల్‌ చేస్తుండడంతో పాటు అతను తీసుకున్న రూ.50లక్షల నగదు ,రివాల్వర్‌ ఫొటోలను వాట్సాప్‌ చేసి బెదిరించిన సంఘటన రాజేంద్రనగర్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది.బాధితుడు, పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఉప్పర్‌పల్లి ప్రాంతానికి చెందిన సామ దామోదర్‌రెడ్డి రియల్‌ఎస్టేట్‌ వ్యాపారం చేస్తున్నాడు. ఆదివారం మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తి అతడికి వాట్సాప్‌ కాల్‌ చేసి నిన్ను చంపేందుకు సుపారీ తీసుకున్నానని, ముగ్గురితో కలిసి ముఠాను సిద్ధం చేశానని, తాను చెప్పగానే నిన్ను చంపేస్తారని బెదిరించాడు. పదే పదే ఫోన్‌ చేస్తుండడంతో దామోదర్‌ రెడ్డి స్పందించలేదు. సోమవారం మరోసారి ఫోన్‌ చేసిన అతను నన్ను లైట్‌గా తీసుకుంటున్నావు.. నీవు ఎక్కడ ఉన్నావో...ఎవరితో తిరుగుతున్నావో.. అన్నీ నాకు తెలుసు , అంటూ అతను కారులో తిరిగిన ఫొటోలు, నగదు, రివాల్వర్‌ ఫొటోలు వాట్సాప్‌ చేశాడు. దీంతో ఆందోళనకు గురైన దామోదర్‌రెడ్డి మంగళవారం రాజేంద్రనగర్‌ పోలీసులకు ఫిర్యాదు చేశారు.